# 24

# గంగవ్వ

## ఇల్లాలు

గంగవ్వ! అవును ఆమె గంగారాం భార్యే! అసలు గంగవ్వ పుట్టడం గంగారాం భార్యగానే పుట్టిందట? కన్నవాళ్ళు పదేళ్ళకే ఆమె మెడలు వంచి తాళికట్టించారు. ఆమె కూడా ఆ మాట కాదనడంలేదు. కాని అది ఏనాటిమాట!

ఆమె నాలుగేళ్ళ క్రితం గంగారాం భార్యే! మరి యిప్పుడు? ఏమో చెప్పలేం. చట్టప్రకారంగానైతే రెండేళ్ళు కలిసి వుండకపోతే ఆమె విడాకులు కోరవచ్చు. కనీసం తాను అతని భార్యను కాననే హక్కుంది. అలా అమె స్వతంత్రంగా జీవించవచ్చు.

అయితే యివేవీ ఆమెకు తెలియవు. తెల్సినా కలిగే అదనపు లాభమూ లేదు. అసలు ఆమె విడాకులు తీసుకోవాల్సిన అవసరమే రాలేదు. ఇక బ్రతుకా? నాలుగేళ్ళుగా స్వతంత్రంగానే బ్రతుకుతోంది. అయినా అతను ఉన్నపుడు మాత్రం కూర్చుని తిని బతికింది గనుకా?

అతను పోయాడు. ఎక్కడికి పోయాడో తెలియదు. ఎంతదూరాన వున్నాడో తెలియదు. చనిపోలేదని మాత్రం ఆమెకు ఎందుకో కొండంత విశ్వాసం. అందుకేనేమో యింకా ముత్తయిదువులా గాజులు వేసుకుంటుంది. వీలైనపుడల్లా నొసట బొట్టు పెట్టుకుంటుంది. ఆ పల్లెవాళ్ళు ఆమెను ముత్తయిదువగానే చూస్తారు.

అయినా గంగవ్వ యింకా అతన్ని ప్రేమిస్తుందని చెప్పలేం. అలా అని నిండుగా ద్వేషిస్తుందనీ చెప్పలేం. అయితే ఆమె ఏదో ఒక సందర్భంలో అతన్ని తలుచుకోని రోజుండదు. తిట్టని రోజుండదు. ఏడ్వని రోజుండదు. అదీ గంగవ్వ జీవితం.

గంగరామే గంగవ్వను వదిలేశాడు. నిజానికి అలా వదిలేశాడని చెప్పలేం. గంగరాం గంగవ్వను వదిలి వెళ్ళిపోయాడు. అంతే, అతన్నుండి ఏ కబురూ లేదు. నాలుగేళ్ళుగా ఎవరిదోవన వాళ్ళు బతుకుతున్నారు.

గంగవ్వ ఇప్పుడెలా బతుకుతుందో గంగరాంకు తెలుసోలేదో! అసలు అతనికి ఆమె గుర్తుందో లేదో తెలియదు. గంగవ్వకు మొదట్లో కొంచెం ఆశ ఉండేది. ఆ ఆశల చెట్టు ఎండిపోయింది.

గంగవ్వ కూడా చాలామంది స్త్రీలలాగే పెళ్లి కోసం పెంచబడింది.

అందుకే గంగరాం వదిలిపోయిన గుడిసెలోనే గంగవ్వ జీవిస్తోంది. గంగరాం వదిలేసిన పిల్లల్తోనే జీవిస్తోంది. గంగరాం వదిలేసిన జ్ఞాపకాల్తో జీవిస్తోంది. గంగరాం వదిలేసిన బాధ్యతలకు గార్డియన్‌గా జీవిస్తోంది.

గంగరాం గంగవ్వను వదిలేసి వెళ్ళిపోయాడని ఆ ఊళ్ళో అందరికీ తెలుసు. అయినా అతని నీడ గంగవ్వను నిత్యం పీడలా వెన్నాడుతూనే ఉంది. నిజానికి పీడలకు అతని ప్రమేయం లేదేమో. నడిమివాళ్ళు, నడమంత్రపు సిరిగలవాళ్ళు తెస్తున్న కష్టాల మధ్య నలిగిపోతోంది గంగవ్వ. గంగవ్వది ఒంటరి, ఆకాశం. ఆ ఊరి ఆకాశం నిండా నిర్బంధం నిరాశా చీకటి పరుచుకుంది. గంగవ్వ పిడికెడు గుండె జడుసుకుంటోంది.

అయినా గంగవ్వ జీవిస్తోంది. బతక్క తప్పదు కనక జీవిస్తోంది. ఆత్మహత్యంటే అసహ్యం, భయం, కనుక జీవిస్తోంది. పిల్లల మీద మమకారం కనుక జీవిస్తోంది. అందుకే గంగవ్వ చనిపోలేదు. అందుకే చనిపోదామనుకుని చనిపోలేకపోయింది. ఇదే గంగవ్వ చేస్తున్న నేరం అనుకున్నారేమో నడమంత్రపు వాళ్ళు.

వాళ్ళ చూపు పెద్దది. ఆ చూపుకు గంగవ్వ ఒళ్ళు ఎన్నిసార్లు పుళ్ళయ్యాయో లెక్కేలేదు. లెక్క పెట్టుకుంటే వచ్చే లాభమూ లేదు. ఇప్పటికి రెండుసార్లు గంగవ్వ గుడిసెను పీకి కుప్పేశారు. నిలువ నీడ లేకుండా చేశారు.

తన శరీరానికి స్పర్శ ఉందని అ పుళ్ళు గుర్తు చేస్తుంటాయి. వారం పది రోజులు మంచం మీంచి లేవనీయవు. అప్పటి బాధ మరో తీరుగా ఉంటుంది. ఇద్దరిలో ఏ ఒక్కరు చచ్చినా బాగుండేదని. ఆ తిట్లూ, దెబ్బలూ అతని కారణంగానే. ఎక్కడో ఏదో జరిగిందట! అందులో గంగరాం ఉన్నాడట! అతన్ని ఎక్కడ వెతకాలో తెలియకపోతే ఇలా విరుచుకుపడాలట! అలా ఎక్కడా రాసి లేదు. అయినా చేసేది అదే. అలా గంగరాం ఈ నాలుగేళ్ళుగా ఆమెను వదిలింది లేదు. అయినా గంగరాం కన్పించడు. అప్పుడప్పుడు యిలా వినిపిస్తుంటాడు.

గంగవ్వ జీవితంలో వసంతాలు మళ్ళీ, మళ్ళీ వాడిపోతున్నాయి. గంగరాంతో కలిసిఉన్న వసంతాలు స్మృతుల్లోనూ కనుమరుగవుతున్నాయి. ఇటీవల గంగరాం వినిపించడమూ, ఆగిపోయింది. అందుకు ఒళ్ళు పుళ్ళు కానందుకు గంగవ్వలో సంతోషమూ, మరొకందుకు భయమూ, ఆందోళనా అలా క్రమంగా గంగవ్వ మనస్సుకు శాంతే కరువైపోయింది. ఆ మౌనం మరింత బాధగా ఉంది. అంటే గంగవ్వ యింకా గంగరాంను ప్రేమిస్తూనే ఉంది. గంగరాం భార్యగానే జీవిస్తోంది. అయినా గంగరాం కనిపించడు. వినిపించడు.

ఆగిపోయిన గంగరాం ధ్వని ఒక్కసారిగా విరుచుకుపడింది. ఎక్కడో నడమంత్రపు సిరిగల వాడెవడో పోయాడట. దాని తాలూకు తుఫాను తాకిడికి గంగవ్వ గుడిసెతో పాటు ఆ ఊళ్ళో మరో అయిదు ఇళ్ళు నేలమట్టమయ్యాయి. అ చుట్టుపక్కల ఊళ్ళల్లో మరి కొన్ని ఇండ్లు కూలిపోయాయి.

గంగరాం నీడే గంగవ్వకు మళ్ళీ నిలవనీడ లేకుండా చేసింది. ఆరేళ్ళ కూతురు తలపగిలి నెత్తుటి మడుగయింది. పదకొండేళ్ళ కొడుకు చెయ్యి విరిగిపోయింది. గంగవ్వ లేవలేకుండా పడిపోయింది. వారం రోజులు ఆ కూలిన శిథిలాల్లో శిథిలాల్లా ఉండిపోయారు వాల్లు.

గంగవ్వకు ఆశ్రయం ఇచ్చినా ఆమె గుడిసె మళ్ళీ లేచినా వాళ్లందరికీ మళ్ళీ అదే గతి పట్టుందని హెచ్చరించారు నడమంత్రపు వాళ్ళు. మరోసారి ఓ పది రోజులు భయమే రాజ్యమేలింది. ఆనక గంగవ్వ గుడిసెను ఆ ఊరు మళ్ళీ నిలబెట్టింది. అది గుడిసె ఆకారమే కాని మునుపటి గుడిసె కాదు. మునుపటి సామానూ లేదు. అదొక పందిరి కింది సంసారం. అదే మహాభాగ్యంగా ఓదార్పుగా కళ్ళు తుడుచుకుంది గంగవ్వ.

❄ ❄ ❄

తుడుచుకున్న గంగవ్వ కళ్ళ తడి ఆరనేలేదు.

మరో వార్త వినపడింది.

ఇప్పుడు గంగరాం లేడు.

గంగవ్వకు వాల్లు కనీసం గంగరాం శవాన్నైనా యివ్వలేదు.

చంపేసిన వాల్లే ఎక్కడో బూడిద చేశారు. కళ్ళారా చూడని వార్తను గంగవ్వ నమ్మలేక పోయింది.

ఏ మూలో ఆశ మినుకుమినుకు మంటోంది.

అలా నెల గడిచిందో లేదో నాన్న గురించి రాశారట అంటూ లేత కాళ్ళతో పరుగున వచ్చింది కూతురు.

ఆ లేత చేతితో ఏదో రంగు కాగితం.

దానిపై నాన్న ఫోటో. గంగవ్వ పొంగి పొరలి ఏడ్చింది.

అలా గంగరాం పూర్తిగా వెళ్ళిపోయాడు.

గంగవ్వ జీవితంలో మరో అధ్యాయం అర్థాంతరంగా ముగిసింది.

అయినా విచిత్రంగా గంగరాం బాధ్యతలు ఆమెకు మిగిలే ఉన్నాయి.

అతని బాధ్యతలే ఆమె బాద్యతలై గంగవ్వ జీవితాన్ని అదుపు చేశాయి.

ఆ జీవితాన్ని గంగవ్వ కోరుకోలేదు.

గంగరాంకు మాత్రం తాను కోరుకున్న జీవితమే కాదు.

చావు కూడా గంగరాం కోరుకున్న విధంగా జరిగిపోయింది.

కానీ గంగవ్వ ప్రమేయం ఏమీ లేకపోయినా మళ్లీ అదే ఆమె జీవితమై పోయింది.

గంగవ్వ రెండో పెళ్ళి తన బాధ్యతలకూ, త్యాగాలకూ అడ్డు కాకుండా కూడా చేసికోవచ్చు.

చేసికోవచ్చనే ధైర్యాన్నివ్వలేక పోయింది సమాజం.

అలా గంగవ్వ రెండో పెళ్ళి చేసుకోలేక పోయింది.

❄ ❄ ❄

కాలం గడుస్తోంది. వయసు పెరుగుతోంది.

అనుభవాల్తోపాటు గంగవ్వలో ధైర్యం కూడా పెరుగుతోంది. ఇప్పుడు గంగవ్వ పెళ్ళి చేసికోవడానికి సమాజపు వెక్కిరింతలు లెక్కచేయకుండా ధైర్యం కూడగట్టుకుంది. కాని యిప్పుడు పెళ్ళి చేసుకోలేదు. ఇప్పుడు గంగవ్వ పిల్లలు ఆమెను క్షమించే స్థితిలో లేరు.

వాళ్ళకు మునుపటి అమ్మే కావాలి. రెండో పెళ్ళి చేసికొన్నా గంగవ్వకు మునుపటి పిల్లలు మునుపటిలాగే కావాలి మరి. ఆమెకు రెండూ కావాలి. కానీ సమాజం ఆమెను ఏదో ఒకటి కోరుకోమంది. గంగవ్వ వాత్సల్యాన్నీ, మాతృత్వాన్నే కోరుకుంది. అలా గంగవ్వ నూరేళ్ళ వైవాహిక జీవితంలో అమె నోచుకున్నది గంగరాంతో గడిపిన ఆ ఎనిమిదేళ్ళ.

❄ ❄ ❄

ఇపుడు గంగవ్వ ముసలిదైపోయింది.

అంది వచ్చిన పెళ్ళికాని కొడుకు సుధాకర్ తండ్రి లాగే పోయాడు. పెళ్ళయిన కూతురు పద్మ తల్లిలాగే మళ్ళీ తల్లి వద్దకు రాకుండా తన ఊళ్ళోనే ఉండిపోయింది.

గంగవ్వ చూపు పడిపోయింది.

'వాళ్ళెవరూ' గంగవ్వకు కనిపించరు.

గంగవ్వ జీవితంలో విషాదం మళ్ళీ మళ్ళీ పునరావృతమౌతూనే ఉంది. అది గంగవ్వ పట్ల మొదటిసారికన్నా మరింత విషాదంగా ప్రవేశించింది.

కన్నతల్లికి కడుపుశోకం.

బాధలుతీరని గంగవ్వ జీవితంలో పెద్ద మార్పేమీలేని మరో రంగు కాగితం.

ఆ కాగితంలో గంగవ్వ కొడుకు సుధాకర్ పుట్టిన ఊరుంది.

పెరిగిన తీరు, చేసిన పనులూ ఉన్నాయి.

వాటికి తగిన నివాళి ఉంది.

లేనిదల్లా గంగవ్వ చేసిన త్యాగాలు గురించే.

అయినా ఇవేవీ గంగవ్వకు తెలియవు. తెలిసినా చేయగలిగిందీ లేదు.

అలా ఆ కాగితం గంగవ్వ జీవితంలో మరో అధ్యాయాన్ని మరింత అర్థాంతరంగా ముగించేసింది.

చివరకు ముడతలు పడ్డ శరీరంతో ఒంటరిగా అడవిలో పండుటాకులా గంగవ్వ కూడా రాలిపోయింది.

తెల్సిన వాళ్ళు గంగవ్వను ఫలానా వాళ్ళ కూతురని గుర్తు చేసుకున్నారు.

కొందరు గంగవ్వను కా॥ గంగారాం భార్యగదా అని మెచ్చుకున్నారు.

చాలా మంది గంగవ్వను కామ్రేడ్ సుధాకర్ కన్నతల్లిగానూ కీర్తించారు.

అలా గంగవ్వ ఒకరి కూతురుగా, ఒకరి భార్యగా, ఒకరి కన్నతల్లిగానో తప్ప ఈ పితృస్వామిక భాష గంగవ్వకంటూ ఒక సొంత పేరు కూడా లేకుండా చేసింది. అసలు అలాంటి భావాలుంటే కదా భాష ఉండడానికి...

తనది కాని జీవితం కోసం గంగవ్వ పుట్టింది పెరిగింది.

తనది కాని జీవితంగానే తనువు చాలించింది.

సమాజం ఆమెనుండి కోరే త్యాగాలే తప్ప హక్కులు లేని సామాజిక జీవితం గంగవ్వది. అన్ని పరిస్థితుల్లో కరిగిపోయే త్యాగశీలి గంగవ్వ.

కుటుంబాన్ని పోషిస్తూ సమాజం కోసం గంగవ్వ చేసిన త్యాగాల చరిత్ర యిది. ఆమె పేరు ఇల్లాలు.

**కథాకాలం 1982-87, రచనాకాలం - 1987.**
**మే 1-15; 1991; నలుపు పక్షపత్రిక**

ఉద్యమంలోకి వెళ్ళిపోయిన భర్తను తలుచుకుంటూ అష్టకష్టాలు పడి పిల్లల్ని కాపాడుకుంటూ జీవితాన్ని వెళ్ళదీస్తుంది ఇల్లాలు. ఆమెకంటూ సొంత 'పేరు' లేకుండా చేసింది సమాజం. ఉద్యమంలో ఉన్న భర్త ఎక్కడ ఏమి చేసినా పోలీసులు ఇల్లాలును, గుడిసెను ఎన్నిసార్లు నాశనం చేసిన్రో తెలియదు. అయినా భర్తనే తలుచుకుంటూ చావలేక, బ్రతకలేక, భర్త వదిలిన కుటుంబ బాధ్యతలను మోసింది.

సమాజం ఆమె నుండి త్యాగాలే తప్ప హక్కులు లేని సామాజిక జీవితం కోరింది. అన్ని పరిస్థితుల్లోనూ త్యాగాలు చేసిన చరిత్ర ఆమెది. ఉద్యమ చరిత్రకంటే దాని వెనుక ఉన్న ఎన్నో కుటుంబాలు చేసిన త్యాగమే నిజమైన చరిత్ర. ఉద్యమంలోకి పోయిన వాళ్ల త్యాగాలనే గుర్తించి వాళ్ళకు ప్రాధాన్యతనిస్తూ వచ్చిన సాహిత్యమే ఎక్కువ. కాని ఉద్యమం వల్ల స్త్రీలు పడిన కష్టాలను వాళ్ళనుభవించిన రాజ్యహింసను సాహిత్యం గుర్తించలేకపోయింది. ఇలా ఉద్యమం తాలూకు విషాద ఘట్టాలు, ఉద్యమం వల్ల అణగారిన కుటుంబాల జీవితాన్ని ఇల్లాలు కథ తెలియజేస్తుంది.

**- డా. కర్రె సదాశివ్** ('తెలంగాణ సామాజిక పరిణామాల్ని చిత్రించిన బి.ఎస్. రాములు కథలు - ఒక పరిశీలన' ఎంఫిల్ నుంచి)